
సాక్షి
బాపట్ల

మంగళవారం | 23 | జూలై | 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 503.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



పెదనెమలిపురిలో కవాతు

రాజుపాలెం: పెదనెమలిపురిలో పోలీసు అధికారులు, సిబ్బంది సోమవారం కార్డన్ సెర్చ్, కవాతు నిర్వహించారు. సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు పాల్గొన్నారు.

భద్రకాళీదేవికి గోరింటాకు సమర్పణ



అచ్చంపేట: స్థానిక పాలకేంద్రం సెంటర్‌లోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో సోమవారం మహిళలు అమ్మవారికి ఆషాఢ గోరింటాకు, సారెలను సమర్పించారు.

న్యూస్‌రీల్

ఆగస్టు 3న జెడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని ఆగస్టు 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో ఎస్ఎస్వీబీ వసంతరాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2019లో ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేల పదవీ కాలం గత జూన్ 5వ తేదీన ముగియడంతో వారి స్థానంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలను జెడ్పీ స్టాండింగ్ కమిటీల్లో సభ్యులుగా ఎన్నుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందు కోసం పంచాయతీ రాజ్ చట్టాన్ని అనుసరించి ఆగస్టు 3వ తేదీన ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీలోని ఏడు స్టాండింగ్ కమిటీల్లో పదవీ కాలం ముగిసిన సభ్యుల స్థానంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలను సభ్యులుగా ఎన్నుకుని, ఆయా ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఒక్కో కమిటీలో 12 మంది సభ్యులు ఉండాల్సిన దృష్ట్యా, పదవీ కాలం ముగిసిన సభ్యుల స్థానంలో 1,2,4,7వ కమిటీల్లో వరుసగా ముగ్గురేసి చొప్పున సభ్యులను ఎన్నుకోవాల్సి ఉందని తెలిపారు. 3, 5, 6వ స్థాయీ సంఘాల్లో ఇద్దరేసి చొప్పున సభ్యులను ఎన్నుకోవాలని వివరించారు.

బిరాబిరా కృష్ణమ్మ

గాలు మార్గానికి కోత



కొల్లూరు : ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో కృష్ణా నదికి స్వల్ప మొత్తంలో వరద నీరు వచ్చి చేరింది. ఎగువ ప్రాంతంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మున్నేరు, బుడమేరు తదితర వాగులు, వంకల నుంచి నీరు నదిలోకి చేరుతోంది. బ్యారేజ్ నుంచి సుమారు 12 వేల క్యూసెక్కుల పైబడి నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్న నేపథ్యంలో మండలంలోని గాజుల్లంక వద్ద జలకళను సంతరించుకుంది. వరద నీటి ప్రవాహం కారణంగా బాపట్ల జిల్లా – కృష్ణా జిల్లాల నడుమ రాకపోకలు సాగించేందుకు నదిలో ఏర్పాటు చేసిన గాలు మార్గం కోతకు గురైంది. రెండు జిల్లాల మధ్య రైతులు, స్థానికులు పడవల సాయంతో రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాదారులు రేపల్లె మండలం పెనుమూడి వారధి మీదుగా సుమారు 45 కిలోమీటర్లు చుట్టు మార్గం ద్వారా ప్రయాణిస్తున్నారు.

ఎలుకల మందు తిని ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం



నర్రా సాయికుమార్



ఉప్పాల నాగలక్ష్మి

బాపట్ల టౌన్: ఎలుకల మందు తిని ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం కర్లపాలెం మండలం యాజలిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజాంపట్నం మండలం మరకావారిపాలెం గ్రామానికి చెందిన నర్రా సాయి కుమార్ నగరం మండలంలోని ఎస్వీఆర్ఎం డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కర్లపాలెం మండలం, యాజలి గ్రామానికి ఉప్పాల నాగలక్ష్మి ఖాజీపాలెంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇద్దరికీ ఆరు నెలల కిందట పరిచయం ఏర్పడింది. అయితే, ఇద్దరు సోమవారం కళాశాలకు వెళ్లలేదు. సోమవారం ఉదయం నర్రా సాయి కుమార్ యాజలిలోని నాగలక్ష్మి ఇంటికి వచ్చాడు. అక్కడ ఏమి జరిగిందో తెలియదు గానీ ఇద్దరు ఎలుకల మందు తిన్నారు. ఈ విషయం స్నేహితులకు తెలియడంతో ఇద్దరినీ బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఆత్మహత్యాయత్నానికి ప్రేమే కారమని సహచర విద్యార్థులు చర్చించుకుంటున్నారు. ఈ మేరకు వైద్యశాలలోని అవుట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

తెనాలిఅర్బన్: ఎన్‌సీసీలో చేరడం వల్ల క్రమశిక్షణతో కూడిన జీవితం ఏర్పడుతుందని 22వ ఆంధ్రా బెటాలియన్ కమాండిగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మహేష్ పేర్కొన్నారు. కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో సోమవారం ఎన్‌సీసీ సెలక్షన్స్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం వివిధ రకాల పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్ని ఎంపిక చేశారు. హెచ్ఎం షేక్ మౌలాబీ మాట్లాడుతూ మొత్తం 120 మంది విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ముందుకు వచ్చారని, పరీక్షలు నిర్వహించి, 80మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు.

రైతుల గుండెకోత

కృష్ణా నదికి వరదల సీజన్ రానే వచ్చింది. దీంతో పరీవాహక లంక గ్రామాల రైతులకు కంటి మీద కునుకు కరువైంది. నదీ ప్రవాహానికి పంట పొలాలు కోతకు గురవుతాయోనని ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు వరదలు వస్తుంటాయి. ఈ సమయంలో సారవంతమైన లంక భూముల్లో సాగవుతున్న పూలు, పండ్లు, ఆకుకూర తోటల్ని వరదలు ముంచెత్తున్నాయి. ఏడాది శ్రమ కృష్ణార్పణం అవుతోంది. కష్టమో... నష్టమో కృష్ణా లంకల్లో పండే పంటలే జీవనాధారంగా రైతులు బతుకుతున్నారు. గత రెండు రోజులుగా కృష్ణా నదికి ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు కారణంగా దిగువకు నీరు వదులుతున్నారు. గత అనుభవాల దృష్ట్యా దేవుడిపై భారం వేసి రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

- కోతకు గురవుతున్న పంట భూములు
- కళ్లెదుటే కృష్ణార్పణం
- ఏటా ముంచెత్తుతున్న వరదలు
- ఆందోళనలో రైతులు
- భయం గుప్పెట్లో లంక గ్రామాల రైతులు
- పంట పొలాలకు మరోమారు పొంచి ఉన్న వరద ముప్పు



భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం వద్ద నది కోత (ఫైల్)

భట్టిప్రోలు: కృష్ణమ్మ బిరబిరమంటూ పరవళ్లు తొక్కుకుంటూ ప్రవహిస్తుంటే కృష్ణా నదీ పరివాహక లంక గ్రామాల రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గతంలో అడపాదడపా వరద ముంపు పొంచి ఉండేది. గత నాలుగైదేళ్లుగా ఏటా వరదలు ముంచెత్తుతున్నాయి. పచ్చని పంటలతో కళకళలాడుతున్న పంట పొలాలు కోతకు గురవుతున్నాయి. బ్యారేజ్ నుంచి సుమారు 12 వేల క్యూసెక్కుల పైబడి నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్న నేపథ్యంలో మండలంలోని గాజుల్లంక వద్ద వరద నీటితో కృష్ణా నది జలకళను సంతరించుకుంది. దీంతో లంక గ్రామాల రైతులు బిక్కుబిక్కుమంటూ దేవునిపై భారం వేసి సాగుకు సమాయత్తమవుతున్నారు.

సమస్య పరిష్కారం ఇలా..

కృష్ణా నదీ తీరం వెంబడి సారవంతమైన పంట భూములు కోతకు గురి కాకుండా కరకట్టలను పటిష్టం చేసేందుకు రివిట్‌మెంట్ వాల్స్‌ను నిర్మించాలి. కొల్లూరు మండలం పోతార్లంక నుంచి తిప్పలకట్ట, జువ్వలపాలెం,భట్టిప్రోలు మండలం పెదలంక, ఓలేరు వరకు ఆరేడు కిలో మీటర్ల మేర ఉన్న పెద్ద రేవు వెంబడి ఈ రివిట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలి. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ సింగం బసవపున్నయ్య పోతార్లంక వాసుల విజ్ఞప్తి మేరకు తన నిధుల నుంచి రేవు వెంబడి బండరాళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ఆ గ్రామంలో రైతులు ఈ విపత్తు నుంచి బయటపడ్డారు. ఇదే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తే పొంచి ఉన్న ప్రమాదాన్ని అరికట్టవచ్చు.

- మట్టి మాఫియా కరకట్టలను సైతం కొల్లగొడుతోంది. దీంతో అవి బలహీనంగా మారుతున్నాయి. రివర్ అండ్ కన్జర్వేషన్ అధికారులు అధికారులు దీనికి చెక్ పెట్టాలి.
- ఓలేరు–తూర్పుపాలెం గ్రామాల మధ్య చెక్ డ్యామ్ ఏర్పాటు చేస్తే సమస్యకు అడ్డుకట్ట పడుతుంది. సముద్రం నుంచి పోటు వచ్చినప్పుడు కృష్ణా నదీ జలాలు ఉప్పులు అవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణా నది మీద భట్టిప్రోలు మండలం ఓలేరు–తూర్పుపాలెం గ్రామాల వద్ద 4.96 టీఎంసీల సామర్థ్యంతో రూ.2,500 కోట్లతో బ్యారేజ్ (చెక్ డ్యామ్) నిర్మాణానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ .జగన్మోహన్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పనులు మొదలుపెట్టే క్రమంలో ఎన్నికలు రావడంతో ఏర్పాటుకు ఆటకం వాటిల్లింది. దీని పై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారిస్తే బాగుంటుందని రైతులు సూచిస్తున్నారు.

వరదలతో రైతులకు కష్టాలు



భట్టిప్రోలు, కొల్లూరు మండలల్లోని లంక గ్రామాల్లో ఏడు వేల ఎకరాల్లో అరటి, పసుపు, కంద, తమలపాకు, మొక్కజొన్న, మల్బరీ, కొబ్బరి, జామ, మామిడి కాయ, మునగ, బొప్పాయి, కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. పెద పులివర్రు, గొరిగపూడి, రేపల్లె ప్రాంతాలకు చెందిన రైతుల పసుపు, కంద, మొక్కజొన్న, కూరగాయల పంటలను పండిస్తున్నారు. ఈ భూమలన్నీ సారవంతమైనవి. వేసవిలో కూడా నీటి వసతికి ఇబ్బంది లేదు. కృష్ణానదికి వరదల సమయంలో మాత్రం పంట పొలాలు కోతకు గురై భారీ నష్టం వాటిల్లుతోంది.కూరగాయలు, పూల తోటలు ముంపులో చిక్కుకుని దెబ్బతింటున్నాయి. ఇంచుమించు వరదల సమయంలోనే కొన్ని పంటలు దిగుబడికి వస్తాయి. కృష్ణమ్మ కన్నెర్ర చేస్తే పెట్టిన పెట్టుబడి సహా మొత్తం ఊడ్చుకు పోతోంది.వరదలు వచ్చినప్పుడు భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం పక్కనే ఉన్న రేవులో వరద నీరు పారుతోంది. దీంతో పంట భూములు కోతకు గురై రేవులో కలిసి పోతున్నాయి. ప్రస్తుతం గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో గాలు మార్గం కోతకు గురై వరద నీరు ప్రవహిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో కృష్ణా నదికి స్వల్ప మొత్తంలో వరద నీరు వచ్చి చేరింది.

పంటలు కృష్ణార్పణం

గతే ఏడాది కళ్ల ఎదుటే పంట భూములు కోతకు గురవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. వరుసగా వరదలు రావడంతో రేవుని ఆనుకుని ఉన్న భూములు పటిష్టతను కోల్పోయి కోతకు గురవుతున్నాయి. వరదల ప్రభావం లేకపోతే భూములకు దన్నుగా చెట్టు, చేమ పెరిగి పటిష్టంగా ఉంటాయి. వరదల సమయంలో పంట భూముల్ని కోల్పోతున్న తమను ప్రభుత్వం ఆదుకుంటే గట్టెక్కుతామని రైతులు అంటున్నారు.



ఓలేరు పల్లెపాలెం వద్ద కోతకు గురైన పసుపు పంట (ఫైల్)

ముంపు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్



బాపట్ల: కృష్ణానది పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురైతే లంక గ్రామాల ప్రజల్ని సంరక్షించడానికి ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి చెప్పారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతాలలో ముంపునకు గురయ్యే గ్రామాల సంరక్షణ చర్యలపై సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. కృష్ణా నది కరకట్ట బలోపేతంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉంటారన్నారు. బలహీనంగా ఉన్న గట్లను గుర్తించి, మరమ్మతులకు యుద్ధప్రాతిపదికన అంచనాలు రూపొందించాలని జల వనరుల శాఖ అధికారుల్ని ఆయన ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు విడుదలైతే మూడు లంక గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, అక్కడ నుంచి ప్రజల్ని తరలించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. మొదటి దశలో వృద్ధులు, గర్భిణులు, చిన్నారుల్ని గుర్తించాలన్నారు. అవసరమైన వాహనాలు, బోట్లు, వనరులు సమకూర్చుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తు రహదారులు, విద్యుత్ వంటి వాటికి నష్టం వాటిల్లితే తక్షణమే పునరుద్ధరించడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. తాగునీటి పైప్‌లైన్లు లీకేజీ లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఇళ్ల వరద, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు వేగంగా చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైన వైద్య కిట్లు, ఔషధాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు రూ. 13,443.60 కోట్లు రుణ పరపతి

- 2024-25 ఏడాది రుణ ప్రణాళిక విడుదల
- బ్యాంకులకు చేరిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదికలు

బాపట్ల టౌన్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం ఇంకా రైతు భరోసా అందించలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారుల్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆరుగాలం శ్రమించే రైతన్నలకు బ్యాంకులు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. పెరుగుతున్న పెట్టుబడికి అనుగుణంగా రుణాలు అందించనున్నాయి. పంటల రుణ పరపతిని ఈ ఏడాది పెంచుతూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నివేదికలు ఆయా బ్యాంకులకు చేరాయి. జిల్లాకు మొత్తం రూ. 13,443.60 కోట్లు కేటాయించగా వాటిల్లో ప్రభుత్వ బ్యాంకింగ్ రంగానికి రూ. 8961.53 కోట్లు (66.66శాతం), ప్రైవేటు రంగానికి చెందిన బ్యాంకులకు రూ. 1618.23 కోట్లు (12.05శాతం), ఆర్ఆర్‌బీలకు 1560.20 కోట్లు (11.60శాతం), కో–ఆపరేటివ్ బ్యాంకులకు 1234.42 కోట్లు (9.18శాతం), ఇతర బ్యాంకులకు 69.23 కోట్లు (0.51శాతం) చొప్పున కేటాయించారు.



2024–25ఏడాదికి రుణ ప్రణాళిక వివరాలు

వ్యవసాయం: మొత్తం రూ. 10,053.58 కోట్లు కేటాయించారు. ఇందులో పంట రుణాలకు రూ. 6,321.57కోట్లు, టెర్మ్ లోన్లకు రూ. 3,008.46 కోట్లు, వ్యవసాయంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 114.25, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రూ. 609.31 కోట్లు కేటాయించారు.

పరిశ్రమలు : ఈ రంగానికి రూ. 1153.33 కోట్లు నిధులు కేటాయించారు. ఇందులో సూక్ష్మ తరహా పరిశ్రమలకు రూ. 609.81 కోట్లు, చిన్న తరహా పరిశ్రమలకు రూ. 357.93 కోట్లు, మధ్య తరహా పరిశ్రమలకు 178.97 కోట్లు, ఇతర పరిశ్రమలకు రూ. 6.63 కోట్లు ఇస్తారు.

ప్రాధాన్యత (ప్రయారిటీ)రంగాలు : మొత్తం రూ. 11,719.31 కోట్లు కేటాయించారు. వాటిల్లో చదువుకు రూ. 55.94 కోట్లు, గృహ నిర్మాణాలకు రూ. 257.32 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 11.19 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకు రూ. 187.96 కోట్లు కేటాయించారు.

ప్రాధాన్యత లేని (నాన్ ప్రయారిటీ)రంగాలు: రూ. 1724.29 కోట్లు

పంటలకు కేటాయించిన రుణ పరిమితి (ఎకరాకు)

పంటపేరు	ఖరీఫ్ (రూ.ల్లో)	రబీ (రూ.ల్లో)
వరి	42,000 నుంచి 46,000	45,000 నుంచి 49,000
శ్రీవరి	32,000–35,000	--
జొన్న	21,000–23,000	19,000–22,000
రాగి	16,000–20,000	--
కొర్ర	16,000–19,000	14,000–15,000
మొక్కజొన్న	42,000–45,000	26,000–28,000
పప్పుధాన్యాలు	18,000–22,000	--
సజ్జలు	16,000–22,000	15,000–19,000
కందులు	20,000–24,000	19,000–22,000
మినుములు	20,000–22,000	20,000–22,000
వేరుశెనగ	35,000–38,000	31,000–35,000
పత్తి	44,000–50,000	42,000–46,000
పచ్చిమిర్చి	90,000–95,000	--
పసుపు	1.00,000–1.10,000	--
కూరగాయలు	35,000–50,000	--
అరటి	90,000–1,00,00	--
పూలతోటలు	60,000–65,000	--
రొయ్యలసాగు	6.00,000–7.50,000	--

లక్ష్యం నెరవేరేలా కృషి

ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందించేందుకు కృషి చేస్తాం. రుణాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నాం. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కె. శివకృష్ణ, లీడ్ బ్యాంక్ మేనేజర్, బాపట్ల జిల్లా

24,25 తేదీల్లో స్పేస్ ఎగ్జిబిషన్

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (ఇస్రో–షార్) ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 24, 25 తేదీల్లో గుంటూరు రూరల్ మండలం చోడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో స్పేస్ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రదర్శనలో భాగంగా రాకెట్ నమూనాలు, శ్రీహరికోట నుంచి జరిగిన వివిధ ప్రయోగాలు, లాంచ్ ప్యాడ్ల ప్రదర్శనతోపాటు ఇస్రో, ప్రముఖ శాస్త్రవేత్తల ఉపన్యాసాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 25వ తేదీ ఉదయం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తారని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత, హైస్కూల్ ప్లస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆసక్తి కలిగిన విద్యార్థుల్ని గైడ్ టీచర్ల సహాయంతో ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు అనుమతించాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరాను 78428 69407 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి కట్టుదిట్ట ఏర్పాట్లు

కలెక్టర్ జె.వెంకట మురళి



ఉత్సవాల నిర్వహణకు మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల: స్వాతంత్ర్య దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించడానికి కట్టుదిట్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణపై జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు రోజున వర్షాలు కురిసినప్పటికీ వేడుకలకు ఆటంకం లేకుండా చూసుకోవాలని సూచించారు. పోలీసు కవాతు మైదానాన్ని ముస్తాబు చేయాలని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా అభివృద్ధిని చాటి చెప్పేలా శకటాల ప్రదర్శన ఉండాలని చెప్పారు. ప్రజా ప్రతినిధుల్ని ఘనంగా ఆహ్వానించాలన్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రేక్షకులు, చిన్నారులకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేదిక ఏర్పాటు, అలంకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆహూతుల్ని అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. స్వాతంత్ర్య వేడుకల్ని జయప్రదంగా నిర్వహించడానికి అధికారులంతా సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, బాపట్ల ఆర్డీవో జి. రవీందర్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ తుషార్ డూడీ, సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావుతో కలిసి కలెక్టర్ పోలీసు కవాతు మైదానాన్ని పరిశీలించారు.

భూ ఆక్రమణలు, ఇసుక దందాపై ఉక్కుపాదం

బాపట్ల: భూ ఆక్రమణలు, ఇసుక అక్రమ రవాణా పూర్తిగా అరికట్టాలని అధికారుల్ని కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు వినతిపత్రాల ద్వారా తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. 83 మంది అర్జీలు అందజేశారు. తన పరిధిలో ఉన్న వాటికి అక్కడికక్కడే కలెక్టర్ పరిష్కార మార్గం చూపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతోనూ అప్పటికప్పుడే మాట్లాడి పరిశీలనకు ఆదేశించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతుంటే పట్టించుకోకపోవడం ఏమిటని పలువురు తహసీల్దార్లను మందలించారు. ఆరోపణలపై విచారించి చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. ప్రభుత్వ భూముల్ని సంరక్షించాల్సిన బాధ్యత తహసీల్దార్లు, ఆర్డీవోలపై ఉందని స్పష్టం చేశారు. నిర్లిప్తంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాపట్ల జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించిన ప్రాజెక్టులపై అధికారులు మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. సాగర్ మాల కింద ఆక్వా పార్కు, హార్బర్లు, బాపట్ల నుంచి చీరాల వరకు టూరిజం హబ్ ఏర్పాటుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చిన్నగంజాం ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. చీరాలలో మెగా టెక్స్ టైల్స్ పార్కు అభివృద్ధి, రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ పాస్‌ల అవసరమైన ప్రాంతాలపై నివేదిక ఇవ్వాలని తెలిపారు. సంబంధిత నివేదికలు స్థానిక పార్లమెంట్ సభ్యులు ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్తాయన్నారు. పత్రికలలో ప్రచురితమయ్యే కథనాల్ని అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వాస్తవాలను గుర్తించాలని సూచించారు. సీసీఆర్‌సీ కార్డుల జారీని వేగవంతం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు చెప్పారు. తహసీల్దార్లంతా చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. సమస్యలపై వచ్చే ఫిర్యాదుల్ని పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, బాపట్ల ఆర్డీవో జి. రవీందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఐల బదిలీ ఉత్తర్వులు నిలిపివేత?

- పోలీసు వర్గాల్లో చర్చ
- ఐజీ ఆదేశాలు ఇచ్చినా రిలీవ్ కాలేదు
- పోస్టింగ్‌లు మారే అవకాశం
- తమకు అన్యాయం జరుగుతుందంటూ సీఎం దృష్టికి తీసుకువెళ్లిన సీఐలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు రేంజి పరిధిలో ఐజీ ఇచ్చిన బదిలీ ఉత్తర్వులు నిలిపివేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన కొందరు సీఐలు ఈ ప్రభుత్వంలో కూడా తమకు అన్యాయం జరుగుతోందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ బదిలీ ఉత్తర్వులు నిలిపివేసినట్లు సమాచారం. ఈ నెల 16న గుంటూరు రేంజి పరిధిలో పనిచేస్తున్న విజయచరణ్‌ను నరసరావుపేట వన్‌టౌన్, సిరిగిరి సాంబశివరావును నరసరావుపేట–2 టౌన్, యు. శోభన్‌బాబును వినుకొండ టౌన్, పసుపులేటి రామకృష్ణను నరసరావుపేట రూరల్, బలగాని ప్రభాకర్‌ను వినుకొండ రూరల్, బి సుబ్బనాయుడిని చిలకలూరిపేట రూరల్, కె.వెంకట ప్రసాద్‌ను అచ్చంపేట, ప్రత్తిపాటి సురేష్‌ను పెదకూరపాడు సర్కిల్, ఎం సుబ్రమణ్యంను సత్తెనపల్లి టౌన్, పొలూరి శ్రీనివాస్‌ను సత్తెనపల్లి రూరల్‌కు బదిలీ చేస్తూ సౌత్ కోస్టర్ జోన్ గుంటూరు రేజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ ఆదేశాలు జారీ చేశారు. మరుసటి రోజు వీరు ఆయా స్థానాల్లో చేరాల్సి ఉంది. మరుసటిరోజు వినుకొండలో దారుణ హత్య జరగడం, అది జరిగిన తీరు దేశ వ్యాప్త చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈలోగా గుంటూరు రేంజి పరిధిలో పనిచేస్తున్న కొంతమంది సీఐలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి తమకు మంచి పోస్టింగ్‌లు ఇవ్వాలని పట్టుపట్టినట్లు తెలిసింది. మరోవైపు ఈ పోస్టింగ్‌ల వెనుక భారీగా డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యేల లేఖలు ఉండటంతో ఐజీ పోస్టింగ్‌లు ఇచ్చారు. ప్రతి నియోజకవర్గంలో తమ సామాజిక వర్గానికి పెద్ద పీట వేయాలంటూ వారు ఒత్తిడి తేవడంతో మొత్తం బదిలీల ప్రక్రియను నిలిపివేశారు. ప్రతి నియోజకవర్గం పరిధిలోనూ కనీసం ఒక సీఐ పోస్టింగ్ అయినా తమకు దక్కాలని వారు పెద్ద ఎత్తున ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. మళ్లీ ఒకటి రెండు రోజుల్లో పోస్టింగ్‌లు వస్తాయని, అవి లోకేష్ నేతృత్వంలో జరుగుతాయన్న ప్రచారం జరుగుతోంది.

ఇప్పటికే గుంటూరు నగరంలో వేసిన పోస్టింగులు ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా లోకేష్ వేయడం, మరికొన్ని స్టేషన్లకు కూడా తాను చెప్పిన వారినే వేస్తారని, మీరు జోక్యం చేసుకోవద్దని స్థానిక ఎమ్మెల్యేలకు చెప్పినట్లు తెలిసింది. తమ పరిధిలో తాము చెప్పిన వారికి కాకుండా పైనుంచి పోస్టింగ్‌లు వేస్తే తమకు పట్టు ఏం ఉంటుందని ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

కాల్వలో పడి యువకుడి మృతి



రేపల్లె రూరల్: ప్రమాద వశాత్తు కాల్వలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బొబ్బర్లంకలో చోటు చేసుకుంది. చోడాయపాలెం ఎస్ఐ రాజ్యలక్ష్మి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రెబ్బా బసంత్ కుమార్ (23) ఆదివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బొబ్బర్లంక సమీపంలోని పొలాల్లో గాలిస్తుండగా కాల్వ పక్కనే గుంతలో పడి మృతి చెంది ఉన్నాడు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

దోమల ద్వారా వ్యాధుల వ్యాప్తి



గుంటూరు మెడికల్: వర్షాకాలంలో మురుగు నిల్వ ఉండి దోమలు గుడ్లు పెట్టి ఆవాసాలుగా మారతాయని, తద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడు వాపు వ్యాధి ప్రబలే అవకాశం ఉంటుందని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చాంబర్‌లో మలేరియా సబ్ యూనిట్ అధికారులకు సీజనల్ వ్యాధులపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు పెరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. దోమతెరలు వాడుకోవాలని, ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. నీరు కలుషితం అవడం వల్ల విరేచనాలు, కలరా, బంక విరేచనాలు, టైఫాయిడ్ ప్రబలుతాయని, ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సురక్షితమైన నీటిని తాగాలని, కాచి చల్లార్చిన తర్వాత తాగడం ద్వారా సీజనల్ వ్యాధుల్ని అరికట్టవచ్చని తెలిపారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్ పాల్గొన్నారు.

బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారం

- ఎస్పీ తుషార్ డూడి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ



దివ్యాంగురాలి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల టౌన్: జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తుషార్ డూడి తొలిసారిగా నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి బాధితులు తమ గోడును ఆయన వినిపించారు. పాత కక్షల నేపథ్యంలో దాడులు.. దివ్యాంగురాలిని హత్య..ఆస్తి కోసం కన్నతండ్రినే కొడకు కిడ్నాప్.. పోస్టాఫీసులో దాచుకున్న రూ. 60 లక్షలతో పోస్టల్ ఉద్యోగి పరారీ తదితర అంశాలు ఆయన దృష్టికి వచ్చాయి. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 38 మంది అర్జీలను అందించారు. బాధితుల సమస్యల్ని ఎస్పీ క్షుణ్ణంగా తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగురాలి బాధను తెలుసుకున్న ఎస్పీ తక్షణమే దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ అద్దంకి పోలీస్‌లను ఆదేశించారు.

దాడుల నుంచి కాపాడాలి

అద్దంకి మండలం, సింగరకొండపాలెం గ్రామానికి చెందిన నేను 20 సంవత్సరాల కిందట జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లు చచ్చుబడి నడవలేని స్థితిలో ఉన్నా. మా గ్రామానికి చెందిన మారం సురేఖ భర్త అప్పుల పాలైతే వాటికి నేనే కారణం అంటూ నిత్యం నన్ను దుర్భాషలాడటమే కాకుండా నాపై దాడులు చేస్తోంది. వారం రోజుల కిందట సురేఖ, చిరంజీవి, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి అనే వ్యక్తులు దివ్యాంగురాలినని చూడకుండా నా ఇంటికొచ్చి ఇష్టమొచ్చినట్లు కొట్టారు. దీనిపై అద్దంకి పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. వారి బారి నుంచి కాపాడాలి.

– దాచేపల్లి నాగమల్లేశ్వరి, అద్దంకి

వేధిస్తున్న భర్త

బల్లికురవ మండలం సోమవరప్పాడు గ్రామానికి చెందిన నాకు నాలుగేళ్ల కిందట 4 గుంటూరు జిల్లా చేబ్రోలుకు చెందిన శివమణికంఠతో వివాహం జరిగింది. నాకు ఇద్దరు పిల్లలు. పెళ్లి సమయంలో రూ. 10 లక్షలు, రెండు ఎకరాల పొలం, 15 సవర్ల బంగారం ఇచ్చాం. ప్రస్తుతం నా భర్త, అత్త సుజాత, అడపడుచు అనూషలు నిత్యం అధిక కట్నం తీసుకురమ్మంటూ నన్ను వేధింపులకు గురి చేస్తున్నారు. వాటిని భరించలేకపోతున్నా. వారి వల్ల నాకు ప్రాణహాని ఉంది.

– ఉగ్గం రామాంజమ్మ

బెదిరిస్తున్న చిట్టీల వ్యాపారి

రేపల్లె పట్టణానికి చెందిన నేను నిజాంపట్నం మండలంలో పశువైద్యాధికారిగా పని చేస్తున్నా. నేను 2020లో కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన కోటా కృష్ణమోహన్ దగ్గర రూ. 5 లక్షల చిట్టీ వేశా. పాడుకున్న సమయంలో నా దగ్గర నుంచి అతను ఖాళీ చెక్, ప్రామిసరీ నోట్లు తీసుకున్నాడు. వాటిని దగ్గర పెట్టుకొని రూ. 75 వేలు ఇవ్వండి.. లేకుంటే వీటిపై లక్షల మొత్తంలో అమౌంట్ రాసి కోర్టుకు వేస్తానంటూ బెదిరిస్తున్నాడు. –ఎం. హేమప్రియ

ఆస్తి కోసం తండ్రి కిడ్నాప్

వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామానికి చెందిన మా అన్న రంగయ్య ఆస్తి కోసం మానాన్న జార్జిను కిడ్నాప్ చేశాడు. ఈనెల 5 నుంచి మానాన్న కనిపించడం లేదు. అన్నయ్యను అడుగుతుంటే సమాధానం చెప్పడం లేదు. మా నాన్నను కారులో తీసుకెళ్లేటప్పుడు మా అన్నతో పాటు బంధువులు నాగమల్లేశ్వరరావు, కృష్ణమూర్తి, నాగరాజు, కిశోర్ ఉన్నారని స్థానికులు చెప్పారు. వారిని విచారించి మా నాన్నను అప్పగించాలి.

– బోరుగడ్డ శారమ్మ

రక్షించాలి

కారంచేడు మండలం నాయుడువారిపాలెం గ్రామానికి చెందిన నేను పొలానికి వెళ్లి తిరిగి వస్తుంటే అదే సమయంలో అటువైపుగా వచ్చిన మా గ్రామానికి చెందిన గుమ్మడి రామ్మోహనరావు, బత్తుల శ్రీనివాసరావులు పాత కక్షల నేపథ్యంలో కర్రలతో, రాడ్డులతో విచక్షణా రహితంగా కొట్టారు. దాడిలో నాకు కాళ్లు, చేతులు విరిగాయి.దీనిపై కారంచేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నన్ను చంపాలని చూస్తున్నారు. గుమ్మడి రామ్మోహనరావు, బత్తుల శ్రీనివాసరావు వల్ల నాకు ప్రాణహాని ఉంది.

– మురుకుంట శ్రీనివాసరావు

60 లక్షలతో పోస్టల్ ఉద్యోగి పరారీ



నగరం మండలం, సిరిపూడి గ్రామానికి చెందిన మేమంతా రెక్కల కష్టంపై ఆధారపడి జీవిస్తాం. కష్టపడిన సొమ్ములో ప్రతి నెలా రూ. 1000 చొప్పున 10 సంవత్సరాల నుంచి మా గ్రామంలోని పోస్టాఫీసులో దాచుకుంటున్నాం. దీంతో పాటు ఒక్కొక్కరం రూ. 3 నుంచి 5 లక్షల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం. మా గ్రామానికి చెందిన పోస్టల్ ఉద్యోగి మనోజ్‌వర్మ 50 మంది మహిళలకు చెందిన రూ. 60 లక్షల సొమ్మును స్వాహా చేసి అడ్రస్ లేకుండా పారిపోయాడు. అతని ఆచూకీ తెలుసుకొని మా సొమ్ము తిరిగివచ్చేలా చూడాలి.

– సిరిపూడి గ్రామస్తులు

రైలులో మరచిపోయిన హ్యాండ్ బ్యాగ్ తిరిగి అప్పగింత



బాపట్ల టౌన్: రైలులో మరిచిపోయిన హ్యాండ్ బ్యాగ్, విలువైన వస్తువుల్ని తిరిగి అందజేసి పలువురి ప్రసంశలు పొందారు రైల్వే పోలీసులు. వివరాలు ఇలా.. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్న శ్రీపతిరాజ్‌కుమార్, భార్య జ్ఞానప్రసూనాంబతో కలిసి సోమవారం ఉదయం ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రైలులో విజయవాడ చేరుకున్నారు. స్టేషన్‌లో రైలు దిగి ఇంటికి వెళ్లేటప్పుడు చూసుకుంటే హ్యాండ్ బ్యాగ్ లేదు. అందులో రెండు సెల్‌ఫోన్లు, కొంత నగదు ఉంది. దీంతో వెంటనే విజయవాడ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే రైలు బాపట్ల సమీపంలోకి చేరుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు బాపట్ల ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మాధవరావు, సిబ్బందితో ప్లాట్‌ఫాంపైకి చేరుకొని ఎ–స3 బోగిలో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని బాధితుల బంధువుకు అందజేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెదకాకాని: లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. మండలంలోని ఉప్పలపాడుకు చెందిన నక్క కృష్ణ (38) గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో దుగ్గిరాల నుంచి ఖమ్మం జిల్లా సత్తుపల్లికి పసుపులోడుతో వెళుతున్న లారీ వెనుక టైర్ల కింద చిక్కుకుని కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య ఆదిలక్ష్మి, కుమారుడు ఉన్నారు. మృతుడు కారు డ్రైవర్. పోలీసులు మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సత్తా చాటిన వైద్య విద్యార్థులు



గుంటూరు మెడికల్: గుంటూరులో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరిగిన ఏపీ న్యూరో కాన్ –2024 రాష్ట్ర సదస్సులో గుంటూరు వైద్య కళాశాల న్యూరాలజీ, న్యూరోసర్జరీ పీజీ వైద్య విద్యార్థులు సత్తా చాటారు. క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. డాక్టర్ ముబషీర్, డాక్టర్ భానుచంద్రప్రసాద్, డాక్టర్ కృష్ణప్రియ, డాక్టర్ సిద్ధార్థలు క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారిలో ఉన్నారు. సిమ్స్ పేపర్ ప్రజెంటేషన్ అవార్డుల్లో న్యూరాలజీ తృతీయ సంవత్సరం చదువుతున్న డాక్టర్ కాంతిమ విజేతగా నిలిచారు. మూవ్‌మెంట్ డిజార్డర్స్‌పై న్యూరాలజీ వైద్య విద్యార్థిని డాక్టర్ కాంతిమ ప్రజెంట్ చేసిన పేపర్‌కు అవార్డు లభించింది. గుంటూరు జీజీహెచ్‌లో మూవ్‌మెంట్ డిజార్డర్స్‌తో 23 మంది చికిత్సకు వచ్చారు. వారికి సకాలంలో వ్యాధి నిర్ధారణ చేసి, చికిత్స చేయడం ద్వారా 17 మంది కోలుకుని ఇళ్లకు వెళ్లారు. ఈ విషయంపై డాక్టర్ కాంతిమ పేపర్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్ర సదస్సులో వివరించగా, న్యాయనిర్ణేతలు ఆమెను విన్నర్‌గా ప్రకటించారు. అవార్డు పేపర్ గెలుపొందిన డాక్టర్ కాంతిమను, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వైద్య విద్యార్థులను సోమవారం న్యూరాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గొట్టిపాటి బిందునర్మద, డాక్టర్ భార్గవి అభినందించారు.

పార్టీ విధేయునికి పట్టం

- శాసన మండలి ప్రతిపక్ష నేతగా లేళ్ల అప్పిరెడ్డి
- నమ్ముకున్న వారికి న్యాయం చేయడమే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్ నైజం



అప్పిరెడ్డిని అభినందిస్తున్న మాజీ మంత్రి నాగార్జున, పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, పక్కన ఇతర పార్టీ నాయకులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): పార్టీ విధేయులు, ఎమ్మెల్సీ, శాసనమండలి మాజీ విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు లేళ్ల అప్పిరెడ్డికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టం కట్టారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా నియమించారు. దీంతో అప్పిరెడ్డి సేవలకు సముచిత గుర్తింపు ఇచ్చినట్టయింది.

లేళ్ల అప్పిరెడ్డి ప్రస్థానం ఇదీ..

డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 2006లో ఆసియాలోనే అతిపెద్దదైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు) చైర్మన్‌గా లేళ్ళ అప్పిరెడ్డి నియమితులయ్యారు. దీనికోసం అప్పట్లో వైఎస్. జగన్ సహకరించారు. తర్వాత వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అవిశ్రాంతంగా శ్రమించిన లేళ్ళ అప్పిరెడ్డికి 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సీటును జగన్ కేటాయించారు. అనంతరం 2020లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులుగా, 2021లో శాసనమండలి సభ్యులుగా, 2023లో శాసనమండలి విప్‌గా నియమించి అప్పిరెడ్డికి జగన్ సముచిత స్థానం కల్పించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఆయన్ను నియమించారు.

అంబరాన్నంటిన సంబరాలు

శాసనమండలి ప్రతిపక్ష నేతగా లేళ్ళ అప్పిరెడ్డి నియమితులు కావడంతో గుంటూరు నగరంలో సంబరాలు అంబరాన్నంటాయి. పలువురు పార్టీ నేతలు చంద్రమౌళీనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మాజీ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున, పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అంగడి శ్రీనివాసరావు, అత్తోట జోసఫ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకష్ణ (ఆచారి), షేక్ రోషన్, దూపాటి వంశీ, వలి వీరారెడ్డి, యక్కలూరి మారుతీ కోటి లింగారెడ్డి, టీఎల్వీ వీరాంజనేయులు, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, పార్టీ నేతలు నూనె ఉమామహేశ్వరరెడ్డి, కొరిటిపాటి ప్రేమ్ కుమార్, కొత్తపల్లి శివ సాంబిరెడ్డి, వలివేటి వెంకటరమణ, మోదుగుల బసవ పున్నారెడ్డి, కౌండిన్య, రేజేటి నవీన్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, పోకల వసంత్, సుబ్బరాజు, కిశోర్, సుశీలరావు తదితరులు ఉన్నారు.

గరువుపాలెం శివాలయంలో చోరీ



చోరీకి గురైన శివాలయంలోని అమ్మవారి విగ్రహం

చేబ్రోలు: ప్రధాన రహదారి పక్కనే ఉన్న దేవాలయంలో దొంగలు పడి విలువైన బంగారు, వెండి వస్తువులు, హుండీలోని నగదు అపహరించుకుపోయిన ఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెంలో సోమవారం జరిగింది. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. గరువుపాలెం సంగంజాగర్లమూడి లాకుల సమీపంలోని తెనాలి రోడ్డు పక్కన దుర్గా సిద్ధేశ్వర మణికంఠ క్షేత్రాన్ని భక్తులు నిర్మించారు. శివుడు, దుర్గాదేవి, అయ్యప్పస్వామి కొలువై ఉన్న ఈ ఆలయానికి పరిసర గ్రామాలతో పాటు దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. సోమవారం ఉదయం ఆలయం తలుపులు తీయడానికి వచ్చిన పూజారి చోరీ జరిగినట్లు గుర్తించి నిర్వాహకులకు సమాచారం అందించాడు. ఆలయం ప్రధాన ద్వారం తలుపును పగలకొట్టిన ఆగంతకులు గుడిలోని ఇతర తాళాలను తీసుకొని చోరీ చేశారు. దుర్గాదేవి అమ్మవారి మెడలో ఉన్న బంగారు మంగళసూత్రాలు, ఇతర వస్తువులు, శివుని విగ్రహం వద్ద ఉన్న వెండి నాగసర్పంతోపాటు చిన్న పంచలోహ విగ్రహాలు అపహరణకు గురయ్యాయి. వీటితో పాటు ఆలయ ప్రాంగణంలోని రెండు హుండీలను పగలగొట్టి అందులోని నగదును దొంగలించుకుపోయారు. ఆరు నెలలుగా హుండీలోని నగదును లెక్కించలేదని నిర్వాహకులు తెలిపారు. ఆలయ పుజారి బెల్లంకొండ వెంకటేశ్వరరావు చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం నివాళి



వెంకటపాలెం(తాడికొండ): అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయం 9:30 గంటలకు పలువురు ఎమ్మెల్యేలు నాయకులతో కలిసి వెంకటపాలెం చేరుకున్న చంద్రబాబు ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం అసెంబ్లీకి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి తదితరులు ఉన్నారు.

పురుగు మందుల నిల్వల గిడ్డంగుల్లో విజిలెన్స్ తనిఖీ




నగరంపాలెం: అనుమతుల్లేకుండా పురుగుమందులు విక్రయిస్తున్న గిడ్డంగుల్లో సోమవారం గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక వ్యవసాయ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు సోమవారం గుంటూరు నగరంలోని పురుగు మందుల గిడ్డంగుల్లో తనిఖీలు కొనసాగాయి. ఏటుకూరు రోడ్డులోని శ్రీపారిజాత ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ స్టోరేజ్ పాయింట్‌లో నిల్వ ఉన్న రెండు రకాల పురుగుమందుల గుళికల బస్తాలపై ముద్రించిన వివరాలు సరిగా లేకపోవడాన్ని గుర్తించారు. స్టాక్ బోర్డులో స్టాక్ వివరాలు సరిగా నమోదు చేయకపోవడంతో పురుగుమందుల చట్టాన్ని అతిక్రమించినట్లు కనుగొన్నారు. దీంతో రూ.10.48 లక్షల విలువ చేసే 38.195 మెట్రిక్ టన్నుల పురుగుమందుల గుళికల అమ్మకాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ ఎస్.శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయ అధికారి (ఏఓ) రమణకుమార్, స్థానిక వ్యవసాయ అధికారి గౌతం ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూబీల వద్ద భద్రతా చర్యలు

డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : భారీ వర్షాల నేపథ్యంలో ఆర్‌యూబీల వద్ద వినియోగదారులు ఇబ్బందులు పడకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ చెప్పారు. ఆయన సోమవారం మాట్లాడుతూ గుంటూరు డివిజన్‌లో ఇప్పటి వరకు 188 ఆర్‌యూబీలను నిర్మించినట్లు వెల్లడించారు. వరదలు, వర్షాల సమయంలో ట్రాఫిక్‌ను ఆపడానికి ఆర్‌యూబీ స్థానాల్లో డే అండ్ నైట్ ఉండేలా వాచ్‌మెన్లను నియమించామని పేర్కొన్నారు. ఆర్‌యూబీల వద్ద పంపింగ్ కాంట్రాక్టర్, రైల్వే అధికారుల ఫోన్ నంబర్లు ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. 188 ఆర్‌యూబీలలో 14 చోట్ల నీరు భారీగా నిలిచిపోయే అవకాశం ఉందని వెల్లడించారు. నీరు నిలవకుండా ఉండేచోట పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. జూన్ 2025 నాటికి పూర్తయి శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

ఉత్తమ షార్ట్ ఫిల్మ్ 'కొండమ్మ'



మంగళగిరి: ప్రముఖ కవి దాశరథి శత జయంతి సందర్భంగా దాశరథి ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన లఘు చిత్ర పోటీలలో తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన త్రినేత్ర ప్రొడక్షన్ వారి కొండమ్మ చిత్రం నాలుగో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈమేరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కొండమ్మ చిత్ర యూనిట్ బృందం బహుమతి అందుకుంది. చిత్రంలో కొండమ్మ పాత్రను పోషించి బహుమతి అందుకున్న ఇల్లా మాధవిని పలువురు కళాకారులు అభినందించారు.

జాతీయ జూడో పోటీల్లో సత్తా చాటిన ఏపీ పోలీసులు

అభినందించిన ఎస్పీ ఏఆర్ దామోదర్



జిల్లా పోలీసు కార్యాలయంలో విజేతలను అభినందిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: అసోంలో జూన్ 24 నుంచి 30 వరకు జరిగిన 9వ ఆల్ ఇండియా జూడో క్లస్టర్–2024 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో తొమ్మిది పతకాలను సాధించారు. అందులో ఒకటి బంగారు, రెండు సిల్వర్, ఆరు కాంస్య పతకాలు ఉన్నాయి. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీసు క్రీడాకారుల్ని ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు. పీనాక్ సిలాత్ పోటీలో పాల్గొన్న కె.చరణ్ తేజ (నెల్లూరు, ఏఆర్ పీసీ) అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని సాధించారు. పెంచాక్ సిలాత్‌లో యం.రాజశేఖర్ (నెల్లూరు, హెచ్‌సీ) , తైక్వాండోలో కె.అరుణ్ కుమార్ (మన్యం పార్వతిపురం, పీసీ) సిల్వర్ మెడల్ దక్కించుకున్నారు. పెంచాక్ సిలాత్, కరాటే పోటీల్లో పి.కల్పన (కర్నూలు, డబ్ల్యూఆర్ ఎస్ఐ), కరాటే పోటీలో నెల్లూరు జిల్లాకు చెందిన ఏ.శ్రావణి (నెల్లూరు, ఏఆర్ పీసీ) కాంస్య పతకాల్ని సాధించారు. కరాటే పోటీలో టి.పావని (వైజాగ్, కానిస్టేబుల్), వి.ప్రియాంక (విజయవాడ, ఏఆర్ కానిస్టేబుల్) కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. తైక్వాండోలో యస్.ఫరహతుల్లా (నంద్యాల, పీసీ) సాధించారు. ఎస్పీ మాట్లాడుతూ ఒంగోలులోని పోలీసు డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్ (డీటీసీ)లో శిక్షణ పొంది తైక్వాండో, కరాటే, పెంచాక్ సిలాత్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీసులు సంస్థకు మరింత పేరు తెచ్చారని కొనియాడారు. ఒకవైపు పోలీసులుగా విధులు నిర్వహిస్తూనే, మరోవైపు నిరంతర సాధనతో క్రీడల్లో రాణించడం గొప్ప విషమని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచారని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలన్న ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు పాల్గొన్నారు.

శిక్షణల పేరుతో టీచర్లను బోధనకు దూరం చేయొద్దు



సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదిలక్ష్మి, కళాధర్

గుంటూరు ఎడ్యుకేషన్: వివిధ రకాల శిక్షణల పేరుతో విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం సరికాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బాట పడుతున్న తరుణంలో ప్రభుత్వ విద్యను, బడిని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వివిధ రకాల శిక్షణ కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేస్తోందని ఆరోపించారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నెల రోజుల కాలంలో జూన్ 14 నుంచి 16 వరకు ఓపెన్ స్కూల్ స్పాట్ వాల్యూయేషన్, జూలై డెట్బాల్ స్వస్థ్ ఇండియా పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేశారని తెలిపారు. ఈనెల 18న మొదలైన టీచ్ టూల్ శిక్షణ ఈనెల 27 వరకు జరుగుతుండగానే, తాజాగా సోమవారం ఇంగ్లిష్ లిటరసీ పేరుతో జిల్లాలోని మరి కొంత మంది ఉపాధ్యాయులను శిక్షణకు పిలిచారని వివరించారు. జూన్ 13 నుంచి 90 రోజుల పాటు విద్యాప్రవేశ కార్యక్రమాల షెడ్యూల్ ఇచ్చి, తాజాగా ఈనెల 28 వరకు శిక్షా సప్తాహ్ పేరుతో మరో షెడ్యూల్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలు ఒకరిద్దరు ఉపాధ్యాయులతో నడుస్తున్న పరిస్థితుల్లో శిక్షణ కార్యక్రమాల వలన సంబంధిత ఉపాధ్యాయులు సైతం బోధనకు దూరమవుతున్నారని, తక్షణమే శిక్షణ కార్యక్రమాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని విజ్ఞప్తి చేశారు.